నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 14 మే 2024 | SURYAPET

సూర్యాపేటలో బారులుదీరిన మహిళా ఓటర్లు

పెరిగిన పోలింగ్

ప్రశాంతంగా ముగిసిన లోక్ సభ ఎన్నికలు

- 2019 కంటే రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ పెరిగిన పోలింగ్ శాతం
- నల్లగొండలో 73.95, భువనగిరిలో 76.47 శాతం
- ఉత్సాహంగా ఓట్లేసిన జిల్లా వాసులు
- ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు

నల్లగొండ మండలం రాములబండలో బారులుదీరిన ఓటర్లు

సూర్యాపేటలో

నల్లగొండ ప్రతినిధి, మే13(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో సోమవారం ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. నడి వేసవిలో సైతం ఆది వారం రాత్రి కురిసిన వర్షంతో పోలింగ్ రోజున వాతావరణం చల్లబడింది. దాంతో ఉత్సాహంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తడంతో భారీగా పోలింగ్ నమోదైంది. 2019లో జరిగిన ఎంపీ ఎన్నికలతో పోల్చుకుంటే గణనీయంగా పోలింగ్ పెరిగినట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. నల్లగొండ పార్లమెంట్ స్థానంలో మొత్తం 17,26,204 మంది ఓటర్లు ఉండగా... వారిలో 73.95 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. భువనగిరి పార్లమెంట్ స్థానం పరిధిలో మొత్తం 18,09,241 మంది ఓటర్లలో 76.47 శాతం ఓట్లు నమోదయ్యాయి. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం తగ్గినా 2019 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే మాత్రం పోలింగ్ శాతం పెరుగడం విశేషం. ఎమ్మెల్యే ఎన్నికల అంత సీరియస్‌గా ఈ ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలు గానీ, ఓటర్లు గానీ తీసుకున్నట్లు కనిపించలేదు. దాంతో ఆ ప్రభావం పోలింగ్ పడిందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాలు సందడిగానే కనిపించాయి. మధ్యలో ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు కొంత ఓటర్ల రాక మందగించింది. అందరు ఊహించినట్లుగా ఎండవేడిమి అంతగా లేకపోవడంతో ఓటర్లు ఊపిరి పీల్చుకున్నారు.

ఉదయం నుంచే ఉత్సాహంగా..

నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో ఉదయం 7గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం వరకు ఎండ వేడిమి ఉండవచ్చని భావిస్తూ ఓటర్లు చల్లని పూటనే ఎక్కువగా తరలివచ్చారు. దాంతో పోలింగ్ కూడా భారీగానే నమోదైంది. ఉదయం 7నుంచి 9గంటల వరకు నల్లగొండ స్థానంలో 12.80శాతం, భువనగిరిలో 10.54శాతం పోలింగ్ నమోదైంది. 11గంటల వరకు నల్లగొండలో 31.21శాతం, భువనగిరిలో 27.97శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు నల్లగొండలో 48.48శాతం, భువనగిరిలో 46.49శాతం, మూడు గంటల వరకు నల్లగొండలో 59.91శాతం, భువనగిరిలో 62.05శాతం, సాయంత్రం 5గంటల వరకు నల్లగొండలో 70.36శాతం, భువనగిరిలో 72.34శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉత్సాహంగా వచ్చిన ఓటర్లు మధ్యలో కొద్దిసేపు వెనక్కి తగ్గారు. తిరిగి 4గంటల నుంచి మిగిలిన ఓటర్లంతా పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. చాలా చోట్ల సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి ఓటర్లు బారులు తీరి కనిపించారు. దాంతో ఆరు గంటలకు కేంద్రాల గేట్లు మూసేసిన అధికారులు అప్పటికే లోపల ఉన్న ఓటర్లంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. తుది ఓటింగ్ నల్లగొండలో 73.95 భువనగిరిలో 76.47 శాతంగా నమోదైంది. అక్కడక్కడా కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించడం మినహా చెదురుమదురు ఘటనలు కూడా చోటుచేసుకోలేదు. పలుచోట్ల మహిళలు, దివ్యాంగులు, యువతతో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను సైతం ఏర్పాటు చేశారు. నల్లగొండలో మొత్తం 17,26,204 మంది ఓటర్లు ఉండగా 2,061 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 22 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. భువనగిరిలో 18,09,241 మంది ఓటర్లు, 2,141 పోలింగ్ కేంద్రాలు, 39 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

భువనగిరి లోక్ సభ పరిధిలో అసెంబ్లీ స్థానాల వారీగా పోలింగ్ శాతం

ఇబ్రహీంపట్నం	66.81
మునుగోడు	83.51
భువనగిరి	81.74
నకిరేకల్	77.08
తుంగతుర్తి	73.70
ఆలేరు	82.52
జనగాం	74.19
మొత్తం	76.47

నల్లగొండ లోక్ సభ పరిధిలో అసెంబ్లీ స్థానాల వారీగా పోలింగ్ శాతం

దేవరకొండ	70.18
నాగార్జున సాగర్	74.45
మిర్యాలగూడ	73.34
హుజూర్‌నగర్	76.30
కోదాడ	75.15
సూర్యాపేట	73.02
నల్లగొండ	75.40
మొత్తం	73.95

2009, 2014, 2019, 2024 పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ శాతం

	2009	2014	2019	2024
నల్లగొండ	74.17	79.53	74.11	73.95
భువనగిరి	76.40	81.22	74.39	76.47

స్ట్రాంగ్ రూమ్స్‌కు ఈవీఎంల తరలింపు

సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగగా.. పలుచోట్ల ఆరు గంటల తర్వాత కూడా ఓటర్లు క్యూలైన్లలో వేచి ఉండి చైతన్యాన్ని చాటిచెప్పారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ బూత్‌లో ఉన్న ఓటర్లు ఎంత సమయమైనా ఓటు వేయించాల్సి ఉన్నందున రాత్రి చివరి ఓటరు వరకు అధికారులు పోలింగ్ నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ ముగిసిన వెంటనే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను భారీ పోలీసు భద్రత నడుమ ముందుగా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాలకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి నల్లగొండ స్థానానికి సంబంధించి నల్లగొండ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లోని స్ట్రాంగ్‌రూములకు తరలించారు. భువనగిరికి సంబంధించిన ఈవీఎంలను అరోరా ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఈవీఎంలన్నీ చేరాక అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల సమక్షంలో రూమ్‌కు సీల్ చేయనున్నారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద భారీ బందోబస్తుతో నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణతో భద్రత చర్యలు చేపట్టారు.

చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం పోలింగ్ కేంద్రంలోకి 6 గంటల లోపు వచ్చిన వారికి టోకెన్లు ఇస్తున్న ఎన్నికల అధికారి

వచ్చే నెల 4న కౌంటింగ్

వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఆ రోజు ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లతో ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. తర్వాత రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కో హాల్ కేటాయించి అందులో ఒక్కో రౌండ్‌లో 14 టేబుళ్లపై 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. ఇలా ఏకకాలంలో ఏడు హాళ్లల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఓట్లను లెక్కిస్తూ అన్ని కలిపి రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడిస్తారు. ఉదయం 10 గంటల వరకు ఫలితాల సరళి వెల్లడి కానుండగా మధ్యాహ్నం మూడు గంట వరకే మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి కానుందని అంచనా.

చిట్యాల : నేరడ గ్రామంలో వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న సహాయక సిబ్బంది

చిట్యాల : ఉరుమడ్లలో ఓటు వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

శాలిగౌరారంలో తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్న భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి : గుండ్లపల్లిలో తల్లితో కలిసి ఓటేసిన బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి

సూర్యాపేలో ఓటు వేసిన మాజీ ఎంపీ బడుగుల

కోదాడలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి

నల్లగొండలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నందికొండ హిల్ కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, నల్లగొండ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఇప్పుడు మారనుంది

- కేసీఆర్ పాలన లేని లోటు జనంలో స్పష్టంగా కనబడుతున్నది
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, మే 13 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఇప్పుడు మారనుందని, ఐదు నెలల్లో జనం ఆలోచనల్లో పెనుమార్పులు వచ్చాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సూర్యాపేటలోని శ్రీ చైతన్య స్కూల్ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పాలన లేని లోటు స్పష్టంగా కనబడుతున్నదని ప్రజలే చెబుతున్నారని అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజా స్పందన చూస్తుంటే మెజారిటీ సీట్లు తమవే అనే నమ్మకం కలుగుతుందని తెలిపారు. కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. లోక్ సభ ఎన్నికలతో ఊహిస్తున్న మార్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

అక్కడక్కడ ఈవీఎంల మొరాయింపు

- ఉమ్మడి జిల్లాలో సజావుగా పోలింగ్

నల్లగొండ ప్రతినిధి, మే13(నమస్తే తెలంగాణ) : నల్లగొండ, భువనగిరి లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. చెప్పుకోదగ్గ సంఘటనలేవీ చోటుచేసుకోలేదు. దాంతో ఎన్నికల అధికారులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. అక్కడక్కడా ఈవీఎంల మొరాయింపులు అనేవి ఎప్పటిలానే కనిపించాయి. కొద్ది సేపట్లోనే సాంకేతిక సమస్యను పరిష్కరించడంతో పోలింగ్ యథావిధిగా కొనసాగింది. చిట్యాల మండలం ఉరుమడ్ల 92వ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ 45 నిమిషాల ఆలస్యంగా మొదలైంది. ఇక్కడే ఓటు వేయాల్సిన నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి కూడా క్యూలైన్‌లో వేచి చూడక తప్పలేదు. ఇదే మండలం గుండ్రాంపల్లిలోని 62వ బూత్‌లో ఈవీఎంలో సమస్యతో రెండు గంటలు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. నేరడుచర్ల మండలం కల్లూరులోని 10వ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో గంటన్నర ఆలస్యమైంది. నిడమనూరు మండలం బంకాపురంలో ఈవీఎం సమస్యతో 35 నిమిషాలు ఆలస్యమైంది. మోత్కూరు మండలం అనాజిపురంలో ఈవీఎంలో సమస్యతో 45 నిమిషాల ఆలస్యమైంది. చౌటుప్పల్‌లోని లింగోజిగూడెంలో 26వ బూత్‌లో గంట ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. చెరుకుపల్లి, జాజిరెడ్డిగూడెంలలోనూ ఈవీఎంలో సమస్య తలెత్తి అంతరాయం కలిగింది. సంస్థాన్ నారాయణపురం మండలం జనగాంతో పాటు భూదాన్ పోచంపల్లిల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద వర్షం నీరు నిలువడంతో ఓటర్లను అసౌకర్యానికి గురిచేసింది.

పోలింగ్ కేంద్రాల వద్ద ఆందోళనలు

పోచంపల్లి మండలం కనుముకులలో యాసంగి ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుందంటూ ఆందోళనకు దిగారు. తమ ధాన్యం కొనుగోలు చేస్తేనే ఓటింగ్‌కు వస్తామంటూ ఓటింగ్‌ను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. దాంతో ఉదయం పూట పోలింగ్‌కు ఓటర్లు రాక వెలవెలబోయింది. తర్వాత తాసీల్దార్ వచ్చి హామీ ఇవ్వడంతో ఓటింగ్‌కు హాజరయ్యారు. ఇక నకిరేకల్ జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓ ఓటరు తన భార్య ఓటును తొలగించారంటూ గేటుకు తాళం వేసే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా వ్యక్తి ఘర్షణకు దిగడంతో ఓ సీఐకి స్వల్ప గాయమైనట్లు తెలిసింది. ఇక రాజాపేట మండలం సింగారంలోని 86 పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ నేతల తీరుపై బీజేపీ అభ్యంతరం తెలుపడంతో కొద్దిసేపు ఓటింగ్ నిలిచిపోయింది. ఇక్కడ బ్యాలెట్ యూనిట్‌పై కాంగ్రెస్ హస్తం గుర్తు వద్ద మార్కర్‌తో మార్క్ చేసి బయటకు వచ్చి ఓటర్లకు చెప్పి ప్రచారం చేస్తున్నారని బీజేపీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలింగ్‌ను రద్దు చేసి రీపోలింగ్ నిర్వహించాలని ఆందోళనకు దిగడంతో అధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

ఓట్లేసిన ప్రముఖులు

జిల్లాకు చెందిన రాజకీయ ప్రముఖులంతా ఓటు హక్కును వినియోగించుకున్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి నల్లగొండలోని ఎంవీఆర్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులు నల్లగొండలోని ఎన్‌పీఎస్ పోలింగ్ బూత్‌లో, కోదాడలో మంత్రి ఉత్తమ్ దంపతులు ఓటు వేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలోని శ్రీచైతన్యస్కూల్ పీఎస్‌లో ఓటు వేశారు. నల్లగొండ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి నక్కలపల్లిలో, యాదాద్రి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి వడపర్తిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి తన స్వగ్రామం ఉరుమడ్లల్లో, కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి తన తండ్రి జానారెడ్డి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి నందికొండలో ఓటేశారు. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మఠంపల్లి మండలంలోని గుండ్లపల్లిలో, భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శాలిగౌరారంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడెంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ఇక ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర రాజకీయ ప్రముఖులంతా కూడా తమ సొంతూళ్లల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులంతా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ పోలింగ్ సరళిని పరిశీలించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52 మంది

63 మందిలో 11 మంది నామినేషన్లు ఉపసంహరణ

ఈ నెల 27న ఎన్నికలు, వచ్చే నెల 5న కౌంటింగ్

నల్లగొండ, మే 13 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 69 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. అందులో ఈ నెల 10న ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 63 మంది అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల యంత్రాంగం అంగీకరించింది. వారిలో 11 మంది సోమవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దాంతో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నల్లగొండ కలెక్టరేట్‌లోని శాసనమండలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌కు అభ్యర్థులు తమ నామినేషన్ల ఉపసంహరణ పత్రాలను సమర్పించారు. కాగా, పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామాతో ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం ఈ నెల 2న నోటిఫికేషన్ వేయగా.. తొమ్మిది వరకు నామినేషన్లు స్వీకరించి పదో తేదీన స్క్రూట్నీ నిర్వహించారు. ఈ ఎన్నిక ఈ నెల 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు బ్యాలెట్ పద్ధతిలో జరుగనుండగా.. జూన్ 5న ఎలిమినేషన్ పద్ధతిలో కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడించనున్నారు. ఓటర్లు ప్రాధాన్యత పద్ధతిలో తమ ఓటును ఎంత మందికైనా వేసేందుకు అవకాశం ఉంది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలో 34 నియోజకవర్గాలతో కూడి ఉన్న ఈ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో మొత్తం 4,63,839 మంది ఓటర్లు ఉన్నారు. వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి 605 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అత్యల్పంగా సిద్ధిపేటలో 4,679 మంది ఓటర్లు ఉండగా, అత్యధికంగా ఖమ్మంలో 83,870 మంది ఓటర్లు ఉన్నారు. దానికి అనుగుణంగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ ఓట్ల లెక్కింపు నల్లగొండ పట్టణ శివారులోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఉన్న రాష్ట్ర గిడ్డంగుల శాఖ గోదాములో జూన్ 5న జరుగనుంది.

అంచనాల్లో అభ్యర్థులు

- ఈవీఎం బాక్సుల్లో నిక్షిప్తమైన ఎంపీ అభ్యర్థుల భవితవ్యం
- పోలింగ్ సరళి, విజయావకాశాలపై సమాలోచనలు
- బూత్‌ల వారీగా పోలైన ఓట్ల లెక్కలపై ఆరా
- ఫలితాల వెల్లడికి 21 రోజుల గడువు

నల్లగొండ ప్రతినిధి, మే 13 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇక లెక్కింపు మాత్రమే మిగిలింది. అయితే ఫలితం తెలుసుకోవడానికి 21 రోజుల పాటు వేచి చూడాల్సిందే. దేశ వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో బరిలో నిలిచిన అభ్యర్థులతోపాటు రాజకీయ నాయకులు, జిల్లా ప్రజల్లోనూ ఫలితాలపై అప్పుడే అంచనాలు మొదలయ్యాయి. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎం బాక్సుల్లో నిక్షిప్తం కాగా.. జననాడిని అంచనా వేసేందుకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుండగానే పలువురు ఆరా తీయడం కనిపించింది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌తోపాటు బీజేపీ, సీపీఎం, స్వతంత్ర అభ్యర్థులు సైతం ఎవరి లెక్కల్లో వారు మునిగి తేలుతున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నల్లగొండ, భువనగిరి స్థానాల అభ్యర్థుల భవితవ్యం వచ్చే నెల 4న తేలనుంది. రాష్ట్రంలో నాలుగో దశలో ఎన్నికలు జరుగగా, ఇంకా మూడు దశల ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. దేశ వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత దేశమంతటా ఒకేసారి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఫలితం వెల్లడి కావడానికి ఇంకా 21 రోజుల సమయం ఉంది. దీంతో ఈ రోజు పోలింగ్ ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల లెక్కలను సేకరించే పనిలో ప్రధాన పార్టీలు, వారి అభ్యర్థులు పడ్డారు. గతం కంటే ఈ సారి పోలింగ్ శాతం పెరుగడంతో అది ఎవరికి లాభిస్తుందనే దానిపై చర్చోపచర్చలు మొదలు పెట్టారు. మంగళవారం తుది పోలింగ్ లెక్కలు వెల్లడి కానున్న నేపథ్యంలో ఆ తర్వాత పోలింగ్ కేంద్రాలు, గ్రామాలు, మండలాల వారీగా, ఆ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అంచనాలకు సిద్ధపడనున్నారు. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లో పోలింగ్ ట్రెండ్‌పై తీవ్ర ఉత్కంఠత నెలకొంది. డిసెంబర్‌లో వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిగణలోకి తీసుకుని కూడా ప్రస్తుత పోలింగ్ సరళిపై దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బూత్‌ల వారీగా పోలైన ఓట్ల లెక్కలను ముందేసుకుని ప్రస్తుత ఎన్నికల్లో ఎన్ని రావచ్చన్న దానిపైనా పార్టీ శ్రేణుల నుంచి వివరాలు తెప్పించుకునే పనిలో పడ్డారు. తమకు ఆయా బూత్‌ల వారీగా ఎన్నెన్ని ఓట్లు పడే అవకాశాలు ఉన్నాయనే లెక్కలను ప్రధాన పార్టీల అభ్యర్థులు వేస్తున్నారు. మరోవైపు సోమవారం పోలింగ్ జరుగుతుండగానే.. పలువురు మీడియా సిబ్బంది, సర్వే సంస్థల సిబ్బంది ఎగ్జిట్ పోల్స్ కోసం ఓటరు నాడిని తెలుసుకునే ప్రయత్నాలు చేస్తూ కనిపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ తమదే విజయమన్న ధీమా ఆ పార్టీ అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ కూడా ఓటర్లు పునరాలోచనతో తిరిగి కేసీఆర్‌కే జై కొట్టారని, తమకే విజయావకాశాలు ఉన్నట్లుగా లెక్కలు వేస్తున్నారు. ఇక బీజేపీ భువనగిరిలో విజయం తమదేనని, నల్లగొండలో సైతం తాము గణనీయంగా ఓట్లను సాధిస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చిట్యాల మండలం ఆరెగూడెం పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలకు సీల్ వేస్తున్న అధికారులు

విజయంపై ఎవరి ధీమా వారిదే..

డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అందులో కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ ఒక స్థానంలో విజయం సాధించాయి. నల్లగొండ పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఒక్క సూర్యాపేట మినహా మిగతా అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ విజయం సాధించింది. భువనగిరి పార్లమెంట్ స్థానం పరిధిలోని జనగాంలో బీఆర్ఎస్ మినహా మిగతా అన్ని చోట్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. దీంతో ఈ సారి కూడా రెండు చోట్లా తమదే విజయమన్న ధీమా కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. అయితే.. 2019లో బీఆర్ఎస్ 9 మంది ఎమ్మెల్యేలను గెలుపొందినా కాంగ్రెస్ రెండు ఎంపీ స్థానాలను గెలుచుకున్నట్లే.. ఈ సారి బీఆర్ఎస్ కూడా అదే విధంగా రెండు స్థానాల్లో విజయం సాధిస్తుందన్న విశ్వాసాన్ని బీఆర్ఎస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఐదు నెలల కాలంలో కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత తమకు విజయానికి దోహదం చేస్తున్న నమ్మకంతో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. ఇక మోదీ చరిష్మాతోపాటు బూర నర్సయ్యగౌడ్ గతంలో ఎంపీగా ప్రజలకు చిరపరిచితుడు కావడంతో భువనగిరిలో విజయం తమదేనని కమలం నేతలు ఢంకా బజాయించి చెప్తున్నారు. ఇలా ఎవరి ధీమాలో వారు ఉన్నా.. ఓట్ల లెక్కింపునకు మరో మూడు వారాల గడువు ఉండడంతో అప్పటివరకు చర్చోపచర్చలు, అంచనాలపై అంచనాలు కొనసాగనున్నాయి.